సాక్షి
విశాఖపట్నం
శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



17వ తేదీ నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 8లో



రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు ఆందోళనకరంగా మారింది. ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. 8లో

సీతమ్మధార: శ్రీ సంపత్ వినాయక స్వామి శుక్రవారం భక్తులకు శ్రీ యోగశాస్త్ర గణపతి అవతారంలో దర్శనమిచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



వైద్య విద్య కలలు చిదిమేయవద్దు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పురుడుపోసుకున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది. అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం 5 ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతులు రాకుండా అడ్డుపడుతోంది. కూటమి ప్రభుత్వం కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్యవిద్య కలగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

–తుపాకుల నవీన్‌కుమార్‌రెడ్డి, మజ్జివలస, భీమిలి మండలం



–తగరపువలస

ప్రైవేటు యాజమాన్యాలకు అప్పగించొద్దు



నీట్‌లో నాకు 524వ ర్యాంకు లభించింది. ఇదే ర్యాంకు తెలంగాణలో వస్తే కన్వీనర్ సీటే వచ్చేది. మన రాష్ట్రంలో వస్తుందా లేదా అన్న సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వ కళాశాలలు ఎక్కువగా ఉంటే విద్యార్థులంతా వైద్య విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. ఇప్పుడు మెడికల్ కళాశాలలను ప్రయివేట్ యాజమాన్యాలకు అప్పగిస్తే ఎవరో కొద్దిమందికే మెడిసిన్ విద్య అందుబాటులో ఉంటుంది. కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ వైపు కాకుండా కొత్త సీట్లు సమకూర్చాలి.

– డి.సోహన్ శ్రీనివాస్ యాదవ్, చిట్టివలస

న్యూస్‌రీల్

ఏయూను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



ఏయూ వీసీతో భేటీ అయిన హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి పి.వెంకటజ్యోతిర్మయి సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత హోంగార్డుకు చెక్కు అందజేత



సుబ్బారావుకు చెక్కు అందజేస్తున్న సీపీ

విశాఖ సిటీ: హోంగార్డుగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన రాచకొండ సుబ్బారావుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా రూ.6,89,410 చెక్కును అందజేశారు. విశాఖ నగర హోంగార్డ్స్ యూనిట్‌లో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి ఈ ఏడాది మే 5న పదవీ విరమణ పొందారు. దీంతో హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.6,89,410 సేకరించారు. శుక్రవారం సీపీ తన చాంబర్‌లో సుబ్బారావుకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ కమాండెంట్ ప్రేమజిత్, విశాఖ రీజియన్ ఆర్‌ఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో పవిత్రోత్సవాలు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజాధికాలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, మృత్సంగ్రహణం, అంకురారోపణ, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

3,200 మంది డ్రైవింగ్ లైసెన్స్ రద్దు



వాహన తనిఖీల్లో పాల్గొన్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న 3,200 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ అధికారులు మూడు నెలలు రద్దు చేశారు. ఇప్పటి వరకు 3,200 మంది లైసెన్స్‌లను రద్దు చేసినట్లు ఉపరవాణా కమిషనర్ తెలిపారు. డ్రైవింగ్ చేసిన వ్యక్తే కాకుండా వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు.

రూ.1.20 కోట్లతో కేజీహెచ్‌కు వైద్య పరికరాలు



ఎంవోయూ పత్రాలను చూపిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, హెచ్‌పీసీఎల్ అధికారులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో బర్న్స్ వార్డుకు పలు అధునాతన వైద్య పరికరాలు ఇవ్వడానికి హెచ్‌పీసీఎల్ సంసిద్ధత వ్యక్తం చేసింది. రూ.1.20 కోట్లతో పలు వైద్య పరికరాలు ఇచ్చేందుకు శుక్రవారం హెచ్‌పీసీఎల్, కేజీహెచ్ ఒప్పందం కుదుర్చుకుంది. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సమక్షంలో జరిగిన ఎంవోయూలో ఇరువురూ సంతకాలు చేశారు. కేజీహెచ్ తరఫున సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, హెచ్‌పీసీఎల్ తరఫున సీజీఎం–హెచ్ఆర్ జి.కిరణ్‌కుమార్, ఈడీ–వీఆర్ ఆర్.రామకృష్ణన్‌లు సంతకాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ పీఆర్‌వో ఎం.కాశీ పాల్గొన్నారు.

జీవీఎంసీలో కమీషన్లు షురూ!

- పర్సంటేజీలు ఫిక్స్
- 8 శాతం ఇవ్వాలని కాంట్రాక్టర్లకు హుకుం
- కమీషన్లు ఇవ్వని పనులకు నో క్లియరెన్స్
- 'స్థాయీ' సభ్యులకు సంబంధం లేకుండా చక్రం తిప్పుతున్న ఓ నేత
- సదరు నేత జోక్యంపై అధికారపార్టీ స్థాయీ సంఘ సభ్యుల మండిపాటు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

అధికార పార్టీ నేతలు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో కమీషన్లు షురూ చేశారు. స్థాయీ సంఘం ఎన్నికల్లో గెలిచిన తర్వాత జరిగిన మొదటి సమావేశంలోనే కమీషన్ల పంట పండించుకునేందుకు సిద్ధమయ్యారు. 8 శాతం కమీషన్ ఇవ్వాలంటూ కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తాము చెప్పిన విధంగా కమీషన్ ఇచ్చిన పనులకు క్లియరెన్స్ ఇచ్చిన స్థాయీ సంఘం సభ్యులు.. పర్సంటేజీలు దక్కని పనులను పక్కన పెట్టినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారమంతా స్థాయీ సంఘంతో సంబంధం లేకుండా.. మేయర్ పీఠం కోసం ఆశపడుతున్న అధికార పార్టీ నేత చక్కబెడుతున్నట్టు తెలుస్తోంది. అయితే నేరుగా తాను రంగంలోకి దిగకుండా తన అనుచరుడిని దించి వ్యవహారాలు నడుపుతున్నట్టు సమాచారం. అనధికారికంగా సదరు నేత పెత్తనంపై అధికారపార్టీలోని స్థాయీ సంఘం సభ్యులు కూడా మండిపడుతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా మొదటి స్థాయీ సంఘం సమావేశంలోనే ఆవు రావురుమంటూ కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజీలు పిండుకోవాలన్న అధికారపార్టీ నేతల వ్యవహారం జీవీఎంసీలో చర్చనీయాంశంగా మారింది.

లెస్‌కు వేసినా...

జీవీఎంసీ పరిధిలో పనులన్నీ టెండర్ల ద్వారానే కట్టబెడుతుంటారు. స్థాయీ సంఘంలో చర్చకు వచ్చిన 280 అంశాల్లోని పనులన్నింటినీ టెండర్ల ద్వారా కట్టబెట్టాలి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ పనులను నామినేషన్ కింద అప్పగించారు. నామినేషన్ మీద అప్పగించిన కొన్ని పనుల్లో తక్కువ పర్సంటేజీకే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు... 8 శాతం కమీషన్ దెబ్బకు తాలెత్తిపోతున్నారు. ఇప్పటికే టెండర్ ధర కంటే తక్కువ ధర కోట్ చేసి దక్కించుకున్న పనులను ఇంత పెద్ద మొత్తంలో పర్సంటేజీలు ఇస్తే... తమకు గిట్టుబాటుకాదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. దీంతో పాటు బిల్లుల కోసం ఇంజినీర్లకు పాటు అకౌంట్ సెక్షన్‌కు ఇచ్చే పర్సంటేజీలన్నీ కలిపితే 15 శాతం వరకూ కేవలం పర్సంటేజీలకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడుగా తక్కువ ధరకు కోట్ చేసిన మొత్తం కూడా తీసివేస్తే... ఇక తమకు ఏమీ మిగిలే అవకాశం లేదని వాపోతున్నారు. ఈ పర్సంటేజీల వ్యవహారంలో అసలు స్థాయీ సంఘంతో సంబంధం లేని వ్యక్తి నిర్ణయాలు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మేయర్ తానేనంటూ...!

స్థాయీ సంఘంతో ఏ మాత్రం సంబంధం లేని అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ ఈ వ్యవహారాలన్నింటినీ చక్కదిద్దేందుకు రంగంలోకి దిగారు. ఏయే అంశాలు చర్చించాలి? ఏయే అంశాలు వద్దు అనే వివరాలన్నీ ఆయన డైరెక్షన్‌లోనే నడుస్తున్నాయి. అధికారులతో సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. దీనిపై 'సాక్షి' కథనాలు ప్రచురించడంతో వెనక్కి తగ్గారు. నేరుగా ఆయన ప్రమేయం లేకుండా... తన అనుచరులను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. ఆయన అనుచరులు స్థాయీ సంఘం సమావేశంపై పెత్తనం చేయడమేమిటని అధికారపార్టీ సభ్యులే మండిపడుతున్నారు. వాస్తవానికి అధికారపార్టీకి మెజార్టీ వచ్చింది.. మార్చిలో పెట్టబోయే అవిశ్వాసతీర్మానంలో తాను మేయర్ అవుతానంటూ సదరు నేత ఇప్పటికే జీవీఎంసీలో అందరికీ చెప్పుకు తిరుగుతున్నాడు. ఇందుకోసం తాను చేసిన ఖర్చులను వసూలు చేసేందుకే పర్సంటేజీలను మాట్లాడుకుంటున్నానంటూ ఆయన చెప్పుకుంటున్నాడు. దీనిపై స్థాయీ సంఘంలోని కొందరు సభ్యులు అధికార తెలుగుదేశం పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్టు కూడా తెలుస్తోంది. మొత్తంగా పర్సంటేజీల వ్యవహారం ఇప్పుడు జీవీఎంసీలో, అధికారపార్టీలో చిచ్చురేపుతోంది.

అధికారులు లేక పలు అంశాలు వాయిదా



స్థాయీ సంఘ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న సభ్యులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం దాదాపు ఏడు నెలల తర్వాత శుక్రవారం జరిగింది. స్థాయీ సంఘ నూతన సభ్యుల ఎన్నిక తర్వాత తొలిసారిగా నిర్వహించిన ఈ సమావేశం అజెండాలో 280 అంశాలు పొందుపరిచారు. ఇందులో 150 అంశాలు మాత్రమే చర్చించగా.. దాదాపు 50 అంశాలు వాయిదా పడ్డాయి. సమయం లేకపోవడంతో మిగిలిన అంశాలకు సంబంధించి ఈ నెల 17న సమావేశం కావాలని నిర్ణయించారు. అధికారులు అందుబాటులో లేని కారణంగా పలు అంశాలు వాయిదా వేయగా.. స్థానిక కార్పొరేటర్ల అనుమతి లేకపోవడంతో మరికొన్ని అంశాలు వాయిదా వేయడం గమనార్హం.

స్థాయీ సంఘ సమావేశం జరిగిందిలా..

ఉదయం 10.37 గంటలకు జీవీఎంసీ సెక్రటరీ ఫణిరామ్ స్థాయీ సంఘ నియమాలు, సూచనలను నూతన సభ్యులకు వివరించారు. 10.42 గంటలకు మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి చర్చ ప్రారంభించారు. సాయంత్రం 5 గంటల వరకు సాగిన చర్చలో 150 అంశాలు చర్చించి, ఇందులో పలు అంశాలు వాయిదా వేశారు. జీవీఎంసీ అన్ని జోన్లకు సంబంధించి పలు అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు వచ్చాయి. వివరణ ఇచ్చే అధికారులు వరద బాధితుల సహాయక చర్యల్లో పాల్గొనేందుకు విజయవాడ వెళ్లిపోవడంతో.. కింది స్థాయి అధికారులు సరైన వివరణ ఇవ్వలేకపోయారు. దీంతో పలు అంశాలు వాయిదా పడ్డాయి. అలాగే స్థానిక కార్పొరేటర్లకు తెలియకుండా స్థాయీ సభ్యుల ఆమోదానికి వచ్చే అంశాలను కూడా సభ్యులు వాయిదా వేశారు. స్థానిక కార్పొరేటర్ల అనుమతి తీసుకువస్తే.. వచ్చే సమావేశంలో ఆమోదిద్దామని చైర్‌పర్సన్‌కు తెలిపారు.

పల్స్‌పోలియో ఖర్చులు మనకెందుకు?

పల్స్‌పోలియోలో భాగంగా ఏఎన్‌ఎం, ఇతర వైద్య సిబ్బందికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన అంశాన్ని సంబంధించి సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. దీనికి చైర్‌పర్సన్ స్పందిస్తూ.. 'మీరు ఈ అంశాన్ని పూర్తిగా చదివారా? పల్స్‌పోలియో అనేది జీవీఎంసీకి సంబంధించింది కాదు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖది. వైద్య సిబ్బంది టిఫిన్, భోజన ఖర్చులు జీవీఎంసీ ఎందుకు భరించాలి?' అంటూ సభ్యులను ప్రశ్నించారు. దీంతో సభ్యులు కంగుతిన్నారు. మనమెందుకు ఈ ఖర్చులు భరించాలో తెలపాలని అధికారుల వివరణ కోరారు. స్థాయీ సంఘ సభ్యులతో పాటు అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, హేమావతి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సభ్యులపై చైర్‌పర్సన్ అసహనం

'స్థాయీ సంఘ సమావేశ నియమ నిబంధనలను కొత్త సభ్యులు తెలుసుకోవాలి. మీలో మీరే చర్చించుకుంటూ వివరణ ఇస్తున్న అధికారులపై రుసరుసలాడడం కరెక్ట్ కాదు. ఏ అంశమైనా ముందుగా సెక్రటరీ సహాయకుడు చదివి వినిపిస్తారు. ఆ తర్వాత ఆ అంశానికి సంబంధించి అధికారి వివరణ ఇస్తారు. అనంతరం ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా సభ్యులు చైర్‌పర్సన్‌కు తెలపాలి. అంతే తప్పా మీలో మీరే చర్చించుకోవడమేంటి' అంటూ చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి సభ్యులపై అసహనం వ్యక్తం చేశారు. జీవీఎంసీ 98 వార్డుల్లోని ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకూడదనే పార్కుల అభివృద్ధికి నిర్ణయం తీసుకున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. దీనిపై సభ్యులు మాట్లాడుతూ ఏ విషయమైనా స్థానిక కార్పొరేటర్‌కు తెలపాలని కోరారు.

రైతుబజార్లకు వారాంతపు సెలవు రద్దు

సీతమ్మధార : మార్కెటింగ్ శాఖకు చెందిన రైతుబజార్లకు వారాంతపు సెలవులను రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని సీతమ్మధార, ఎంవీపీ కాలనీ, నరసింహనగర్ (అక్కయ్యపాలెం), కంచరపాలెం బజార్ల సెలవులను రద్దు చేశారు. ఈ మేరకు రైతుబజార్ల చైర్మన్, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇకనుంచి ఈ రైతు బజార్లు వారం రోజులు పనిచేస్తాయని అధికారులు తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించాలన్నారు.

17న ఎమ్మెస్సీ అప్లైడ్ కెమిస్ట్రీ పరీక్ష

విశాఖ సిటీ: వర్షాలు కారణంగా వాయిదా వేసిన ఎమ్మెస్సీ అప్లైడ్ కెమిస్ట్రీ సెమిస్టర్–2 ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ పరీక్ష ఈ నెల 9వ తేదీన జరగాల్సి ఉన్నప్పటికీ ఆ సమయంలో భారీ వర్షాల కారణంగా పరీక్ష వాయిదా వేసినట్లు చెప్పారు. తాజాగా ఈ నెల 17న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. అలాగే దీంతో పాటు యోగాలో పీజీ డిప్లమో సెమిస్టర్–2 చివరి పరీక్ష కూడా 17వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతుందని వివరించారు.

కొంచెం నవ్యంగా... కొంచెం దివ్యంగా

- సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న వినూత్న గణనాథులు
- ట్విట్టర్, ఇన్‌స్టాలో లక్షల్లో వ్యూస్, లైక్స్

ఎంవీపీకాలనీ: ట్రెడిషన్‌తోపాటు ట్రెండ్ అయ్యే కాన్సెప్టులతో వినాయకచవితి వేడుకలు విశాఖ వాసులు జరుపుకుంటున్నారు. నవ్య ఆలోచనలతో విగ్రహాలను నెలకొల్పారు. ఈక్రమంలో సోషల్ మీడియాలో ఈ విగ్రహాలు ట్రెండింగ్‌లో నిలుస్తూ లక్షల వ్యూస్, లైక్స్ సొంతం చేసుకుంటున్నాయి.



బెల్లం వినాయకుడు

@ 1,29,000 వ్యూస్

జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెం వద్ద ఏర్పాటు చేసిన 75 అడుగుల బెల్లం వినాయకుడు విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. స్థానిక లంబోదర చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఈ ఏడాది సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న వినాయక విగ్రహాల్లో ఇదొకటిగా నిలిచింది. ఇప్పటి వరకు 1,29,000 వ్యూస్ సొంతం చేసుకుందని నిర్వాహకులు తెలిపారు.



అయోధ్య రామాలయంలో గణపతి

@ 86,000 వ్యూస్

ఎంవీపీకాలనీలోని సెక్టార్–10లో అయోధ్య రామాలయం సెట్‌తో బాల గణపతిని యూత్ ఐకాన్ సంస్థ సభ్యులు ఏర్పాటు చేశారు. విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఏడాది సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రెండ్ అవుతున్న వినాయక విగ్రహాల్లో ఇదికూడా ఒకటిగా నిలిచింది. ఈ విగ్రహానికి ఇప్పటి వరకు 86,000 వ్యూస్ వచ్చాయి. భక్తులు భారీగా దర్శించుకుంటున్నారు.



బాలగణపతి

@ 1,12,000 వ్యూస్

వుడాపార్కు దరి చినవాల్తేర్ రజకవీధి బెస్ట్ ఫ్రెండ్స్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో బాలగణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రతి 30 సెకన్లకు ఒక సారి కళ్లుమూసి, తెరుస్తుండటం ఈ విగ్రహం ప్రత్యేకత. సోషల్ మీడియాలో ఇప్పటి వరకు 1,12,000 వ్యూస్ సొంతం చేసుకుంది.

రైతు రుణాల రీషెడ్యూల్‌కు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు రుణాలను రీషెడ్యూల్ చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వివిధ బ్యాంకుల అధికారులను ఆదేశించారు. తక్కువ వడ్డీకే రుణాలను మంజూరు చేయాలని కోరారు. రుణాల రీషెడ్యూల్, కొత్త రుణాల మంజూరుపై ప్రత్యేక జిల్లా సలహాదారు కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పద్మనాభం, పెందుర్తి మండలాల్లోని 31మంది రైతులకు చెందిన 7.84 హెక్టార్ల వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఆ రైతులందరి రుణాలను రీ షెడ్యూల్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, డీఆర్డీఏ పీడీ ఎంఎస్ శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, మత్స్య శాఖ జేడీ జి.విజయ, పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ డి. రామకృష్ణ, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో కాకడు–2024 విన్యాసాలకు ఈఎన్‌సీ

విశాఖ సిటీ: కాకడు–2024 విన్యాసాల్లో భాగంగా ఫ్లీట్ కమాండర్స్ సదస్సులో పాల్గొనేందుకు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఈస్టర్న్ ఫ్లీట్ రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్ ఆస్ట్రేలియాలోని డార్విన్‌కు వెళ్లారు. అక్కడ 28 విదేశీ నౌకాదళాల ఉన్నతాధికారులతో తూర్పు నావికాదళం అధికారులతో కలసి ఆయన సమావేశమయ్యారు. కాకడు–2024 విన్యాసాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఇండియన్ నేవీ పీ8ఐ ఎయిర్ క్రాఫ్ట్ సిబ్బందితో సంభాషించారు.




ఆస్ట్రేలియాకు వెళ్లిన తూర్పు నావికాదళం అధికారులు


సీఎంఆర్‌ఎఫ్‌కు వైజాగ్ పోర్ట్ రూ.కోటి విరాళం


మహారాణిపేట: విజయవాడ వరద ప్రభావిత ప్రాంత ప్రజల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) రూ.కోటి విరాళం ఇచ్చింది. పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్, వివిధ విభాగాధిపతులు కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు చెక్కును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి అవసరమైనపుడు సహాయ సహకారాలు అందించడంలో విశాఖ పోర్ట్ యాజమాన్యం, సిబ్బంది ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. వరద బాధితులకు సహాయంగా పోర్ట్ కార్మిక, అధికారుల సంఘాలతో చర్చించి, కార్మికుల ఒక్క రోజు మూల వేతనం, అధికారుల ఒక రోజు మూలవేతనం, ఒక రోజు డీఏ రూ.45,81,770తోపాటు, సీఎస్సార్ నిధి నుంచి రూ.54,18,230 కలిపి రూ.కోటి విరాళంగా అందించేందుకు పోర్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఆ మేరకు చెక్కును కలెక్టర్‌కు అందించామన్నారు.



జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు చెక్ అందిస్తున్న పోర్టు కార్యదర్శి వేణుగోపాల్







ఓ వైపు సాగరతీరం..మరో వైపు నీలి మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. సంద్రం.. మేఘం కౌగిలింతలో ఓ మెరుపు మెరిసింది.. కళ్లు జిగేల్‌మన్నాయి. నేనేం తక్కువ కాదంటూ వరుణుడు జల్లులు కురిపించాడు.. ఈ అద్భుత కలయికను నగరవాసులు ఆస్వాదించారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'స్వచ్ఛతా హీ సేవ'ను విజయవంతం చేద్దాం

కలెక్టర్ హరేందిరప్రసాద్

మహారాణిపేట: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పరిసరాల శుభ్రతపై మానవహారాలు, తల్లి పేరుతో ఒక మొక్కను నాటడం, విద్యుత్ పొదుపు, నీటి ఆదాపై అవగాహన శిబిరాలు, చెత్త ఉండే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం, క్విజ్ పోటీలు, విద్యార్థులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. అన్ని మండలాలు, జీవీఎంసీ పరిధిలో ఈ కార్యక్రమాలు జరగాలని, అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివాస్ పేరుతో ముగింపు వేడుకలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్వచ్ఛతా హీ–2024కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, ఎస్డీసీ సీతారామమూర్తి, జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి, జెడ్పీ సీఈవో సత్యనారాయణ, డీపీవో శ్రీనివాసరావు, సీపీవో శ్రీనివాసరావు, డ్వామా పీడీ సందీప్, డీఆర్డీఏ పీడీ శోభారాణి, డీఈవో చంద్రకళ తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగంలో సీట్లు పెంచాలి



నీట్‌లో 478 మార్కులు వచ్చాయి. దీని వల్ల ఏ–కేటగిరీకి బదులు బి–కేటగిరీ సీటు వచ్చింది. ఏలూరు ఆశ్రమ్ కాలేజీలో చదువుతున్నాను. రిజర్వేషన్ లేదు. మాలాంటి వారికి ఓపెన్‌లో ఏ–కేటగిరీలో ప్రభుత్వ కాలేజీలో సీటు రావాలంటే కొత్తగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పెరగాలి. ప్రస్తుతం ఏడాదికి ఫీజు రూ.13 లక్షల ఫీజు కట్టాల్సి వస్తోంది. అదే ఏ –కేటగిరీ అయితే ఫీజు రూ.20 వేలు మాత్రమే ఉంటుంది. ప్రభుత్వ కాలేజీలు అయితే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులోకి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పేద విద్యార్థులకు మేలు జరిగేలా తగిన నిర్ణయం తీసుకోవాలి.

– గోపిశెట్టి గీత, మురళీనగర్



మురళీనగర్/ఆరిలోవ

ఆశలు నీరుగార్చవద్దు



మెడిసిన్ చేయాలని ఎన్నో ఆశలతో చదువుతున్నాం. కూటమి ప్రభుత్వం కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోంది. గత ప్రభుత్వం మొత్తం 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టింది. ఇందులో ఐదు ప్రారంభమయ్యాయి. మరో ఐదు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంకా 7 నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ కళాశాలలన్నీ పూర్తయితే మొత్తం 1,800 సీట్లు అందుబాటులో వస్తాయి. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు మెడిసిన్ చదవడానికి అవకాశం లభిస్తుందనుకొన్నాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ కాలేజీలపై కత్తి కట్టింది. దీని వల్ల నీట్ రాసి మంచి ర్యాంకులు సాధించినప్పటికీ సీట్లు పొందలేని పరిస్థితి ఏర్పడింది. – గొలగాని శ్రీరాజ్ఞ, పెదగదిలి

అగమ్యగోచరం.. స్టీల్‌ప్లాంట్ భవితవ్యం

- నోరు మెదపని చంద్రబాబు, పవన్‌కల్యాణ్
- ఒక ఫర్నేస్‌తో కనిష్ట ఉత్పత్తి
- సెయిల్‌లో విలీనంతోనే పరిష్కారం



ఉక్కునగరం: రాష్ట్రంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్ ఆందోళనకరంగా మారింది. ప్రస్తుతం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో, ఒక బ్లాస్ట్‌ఫర్నేస్‌తో కనిష్ట ఉత్పత్తి సాధిస్తూ సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. ఇప్పుడు ఉన్న బొగ్గు, ఐరన్ ఓర్ నిల్వలతో సింగిల్ ఫర్నేస్ తప్ప రెండు ఫర్నేస్‌లు నడిపే పరిస్థితి లేదు. సింగిల్ ఫర్నేస్‌తో నెలకు రూ. 1000 కోట్లకు మించి టర్నోవర్ సాధ్యం కాదు. తద్వారా మరిన్ని అప్పులు, ఇబ్బందులు తప్పవని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగి.. ఉన్న ఒక్క ఫర్నేస్‌లో సాంకేతిక లోపం తలెత్తితే జీరో ఉత్పత్తి ఏర్పడే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో సెయిల్‌లో విలీనమే శాశ్వత పరిష్కారమని కార్మిక సంఘాల నాయకులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని విలీనం దిశగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నారు.

ఇటీవల కాలంలో స్టీల్‌ప్లాంట్ పరిస్థితి అత్యంత క్లిష్టదశకు చేరుకుంది. మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లలో ఒకటి మూడేళ్లుగా మూత పడి ఉంది. ఉన్న రెండింటిలో ఒక బ్లాస్ట్‌ఫర్నేస్‌లోనే కనిష్ట స్థాయి ఉత్పత్తి చేయాల్సిన పరిస్థితి రావడంతో ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమయ్యాయి. గత మూడు రోజులుగా న్యూఢిల్లీ కేంద్రంగా ఉక్కు మంత్రిత్వశాఖ విస్తృతంగా జరిపిన చర్చల్లో ఉక్కు యాజమాన్య ప్రతినిధులు రూ.12 వేల కోట్లు బెయిల్ ఔట్ ప్యాకేజీ ఇస్తే పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తామని నివేదించారు. దీనిపై ఉక్కు మంత్రిత్వశాఖ అధికారులు అంతసాయం చేయలేమని, రూ.3,100 కోట్లు ఇవ్వగలమని, దానికి సంబంధించి ప్రణాళిక ఇవ్వాల్సిందిగా సూచించారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ వర్గాలు కసరత్తు చేస్తున్నాయి. ఉక్కు మంత్రిత్వశాఖ ఇస్తామన్న ప్యాకేజీ రూ.3,100 కోట్లు ముడి సరకులు కొనుగోలుకు ఉపయోగపడటం తప్ప ఇప్పటి వరకు ఉన్న బకాయిలు చెల్లించడానికి సరిపోయే పరిస్థితిలేదు. ఒకవేళ ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుమతితో ఆ ప్యాకేజీ ఇచ్చినప్పటికీ స్టీల్‌ప్లాంట్ సింగిల్ ఫర్నేస్ నిర్వహణకు తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని ఉక్కు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపడంతో పాటు సెయిల్‌లో విలీనం చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యేలను ప్రజలు అత్యంత మెజార్టీతో గెలిపించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఉక్కు అఖిలపక్ష నాయకులను అమరావతికి తీసుకెళ్లి సీఎం చంద్రబాబుతో సమావేశం ఏర్పాటు చేయించారు. 'మీరు పని చేయండి.. నేను చూసుకుంటాను' అని చంద్రబాబు చెప్పడం తప్ప.. ఆ దిశగా ఎటువంటి చర్యలు కనిపించలేదు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రధాని మోదీని చంద్రబాబు కలిసినప్పటికీ స్టీల్‌ప్లాంట్ అంశాన్ని లేవనెత్తకపోవడం పట్ల ఉక్కు వర్గాలు విస్మయం చెందాయి. విశాఖ ఎంపీ భరత్‌ను కలిసి స్టీల్‌ప్లాంట్ పరిస్థితిని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వివరించారు. అతను కూడా కేంద్ర మంత్రి కుమారస్వామితో మాట్లాడి ఒత్తిడి తెచ్చిన దాఖలాలు లేవు. కొత్త ప్రభుత్వం కొలువైన తర్వాత స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి 45 రోజులు సమయం ఇస్తే కచ్చితంగా మంచి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీకీ అతీగతి లేదు. గత వారం ఉక్కు అధికారుల సంఘం నాయకులు కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్‌ను కలిసి సెయిల్‌లో విలీనం అంశంపై మాట్లాడారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తే తప్ప పరిస్థితిలో మార్పు ఉండదని తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణం జోక్యం చేసుకోవాలని కార్మిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇప్పించడంతో పాటు సెయిల్‌లో విలీనం చేసేలా ఒత్తిడి తేవాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

విస్తరణ అప్పులు, వడ్డీ పదేళ్లు వాయిదా వేయాలి



స్టీల్‌ప్లాంట్ విస్తరణకు చేసిన అప్పులు, దానిపై వడ్డీ భారం వల్ల స్టీల్‌ప్లాంట్‌కు ఈ పరిస్థితి తలెత్తింది. దేశంలోని ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఇచ్చినట్టే విస్తరణ అప్పులు, వడ్డీలను మాఫీ చేయడం లేదా కనీసం పదేళ్లపాటు వాయిదా వేయాలి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఆర్థిక భారం తొలగించాలి. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా ముడిసరకు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి.

– డి.ఆదినారాయణ, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్

ప్రభుత్వ రంగం కోసమే భూములిచ్చారు



రాష్ట్రంలోని అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ కోసమే నిర్వాసితులు తమ భూములు, ఇళ్లు ఇచ్చారు. వారి పునరావాసం, ఉపాధి చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసే హక్కు కేంద్రానికి లేదు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్యాకేజీతో పాటు సెయిల్‌లో విలీనం చేసేలా చూడాలి.

– మంత్రి రాజశేఖర్, ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి, స్టీల్‌ప్లాంట్

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం అందరి బాధ్యత



స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కర్తవ్యం. కేంద్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆధారపడి ఉందనే విషయం అందరికీ తెలిసిందే. ఆయన మాట చెబితే ఆగుతుంది. 1,310 రోజులుగా ఉద్యమం జరుగుతోంది. ఇతర స్టీల్‌ప్లాంట్ల కంటే ఎక్కువ ల్యాండ్ బ్యాంక్ ఉండటం వల్లే అందరి కళ్లు ఈ ప్లాంట్‌పై పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలి.

– జె.అయోధ్యరామ్, గౌరవాధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ

17 నుంచి ఆలయాల్లో స్వచ్ఛ భారత్

మహారాణిపేట: ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అన్ని ఆలయాలు, ధర్మసత్రాల్లో మొక్కలు నాటడం, పరిసరాల శుభ్రత కార్యక్రమాలను చేపట్టాలని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయశాఖ ఉప కమిషనర్లు,జిల్లా సహాయ కమిషనర్లలతో శుక్రవారం కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రణాళిక తయారు చేశామన్నారు. అనకాపల్లి దేవదాయశాఖాధికారి రాజారావు, సీనియర్ అసిస్టెంట్ మురళీ పాల్గొన్నారు.

29న దివ్యాంగుల పారా షూటింగ్ పోటీలు

మహారాణిపేట: విశాఖ వేదికగా ఈ నెల 29న ప్రారంభం కానున్న 3వ రాష్ట్ర స్థాయి పారా షూటింగ్ పోటీల పోస్టర్‌ను జిల్లా దివ్యాంగుల వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవీలత శుక్రవారం ఆవిష్కరించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 25 లోపు 7095811456/ 9390131777 సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి.రామస్వామి విజ్ఞప్తి చేశారు. పీకే జోష్ ,శీతల్ మదన్, షూటింగ్ కోచ్ మల్లేష్ , షేక్ గులాం హుస్సేన్ పాల్గొన్నారు.

బహిరంగ వేలంలో 28 దుకాణాల కేటాయింపు




వేలం ప్రక్రియలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో వీఎంఆర్‌డీఏకు చెందిన వాణిజ్య సముదాయాలు, ఆడిటోరియాలు, ఆఫీస్‌లు, ఖాళీ స్థలాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం ప్రక్రియకు 95 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఉద్యోగ భవన్ కాంప్లెక్స్, ఎంవీపీ, సీతమ్మధార, లాసన్స్‌బే కాలనీ, మాధవధార, కూర్మన్నపాలెం, కైలాసగిరి, రాంనగర్, వీఎంఆర్‌డీఏ పార్కు, టీయూ–142, సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఖాళీ షాపులకు నెలసరి/సంవత్సరం అద్దె చెల్లింపు ప్రాతిపదికపై మూడేళ్ల లీజుకు ఇచ్చేందుకు చేపట్టిన వేలంలో 28 మందికి దుకాణాలు కేటాయించారు. వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, పరిపాలనాధికారి వెంకటేశ్వరరావు, డీఈ రవిశంకర్ పాల్గొన్నారు.

ఆర్.కె.బీచ్‌లో బాలిక ఆత్మహత్యాయత్నం

బీచ్‌రోడ్డు: ఆర్.కె.బీచ్‌లో 17 ఏళ్ల బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగానే ఉంది. మూడో పట్టణ సీఐ పల్లా రమణయ్య తెలిపిన వివరాలివీ.. శుక్రవారం సాయంత్రం ఆర్.కె.బీచ్‌కు చేరుకున్న బాలిక తనతో తీసుకొచ్చిన గోళ్ల రంగును తాగింది. కాసేపటికి ఆరోగ్యం విషమించడంతో చుట్టుపక్కల ఉన్న సందర్శకులు గమనించి.. బీచ్‌గార్డ్‌లకు సమాచారం అందించారు. దీంతో వెంటనే అక్కడకు చేరుకున్న బీచ్ గార్డ్‌లు బాలికకు ప్రథమ చికిత్స అందించారు. ఆ తర్వాత ఆమెను కేజీహెచ్‌కు తరలించి, చికిత్స అందించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం బాగానే ఉందని పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ట్రాలర్ ఢీకొని వివాహిత దుర్మరణం



కిరణ్మయి మృతదేహం

సీతమ్మధార: ట్రాలర్ ఢీకొని వివాహిత దుర్మరణం చెందారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలివీ.. గాజువాక బీసీరోడ్డు సంజీవ్‌గిరి కాలనీలో మోర్తా కిరణ్మయి (35) భర్త శ్రీనివాసరావుతో కలిసి నివాసం ఉంటున్నారు. వీరికి ఏడాది కిందటే వివాహం జరిగింది. శ్రీనివాసరావు ఓ సంస్థలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆమె స్కూటీపై నగరానికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి మద్దిలపాలెం నుంచి గురుద్వారా మార్గంలో గాజువాక వెళ్తున్నారు. మార్గమధ్యలో శాంతిపురం జాతీయ రహదారి వద్ద వెనుకనే వస్తున్న పశ్చిమ బెంగాల్‌కి చెందిన ట్రాలర్ స్కూటీని ఢీకొట్టింది. ట్రాలర్ ఎడమ వైపు చక్రాలు ఆమె మీద నుంచి వెళ్లిపోయాయి. దీంతో ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీకాకుళం రోడ్-సికింద్రాబాద్ మధ్య స్పెషల్ రైలు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్–శ్రీకాకుళం రోడ్–సికింద్రాబాద్ మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్–శ్రీకాకుళం రోడ్(07487) ఏసీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు, శ్రీకాకుళం రోడ్–సికింద్రాబాద్(07488) ఏసీ స్పెషల్ అక్టోబరు 3 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు నడుస్తుంది.

పలాస మెము శ్రీకాకుళం వరకే.. : వాల్తేర్ డివిజన్ పూండి–నౌపడ సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే విశాఖపట్నం–పలాస–విశాఖపట్నం మెము స్పెషల్ గమ్యం కుదించారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఈ రైలు శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. ఈ తేదీల్లో శ్రీకాకుళం రోడ్–పలాస మధ్య ఈ రైలు నడవదు.

సింహగిరిపై పవిత్రోత్సవాలకు అంకురార్పణ



ప్రధానార్చకుడికి దీక్షా వస్త్రం అందజేస్తున్న ఈవో

సింహాచలం: సింహగిరిపై పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం రాత్రి అంకురార్పణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా సింహగిరిపై ఉన్న పుట్టబంగారు మండపంలో నిర్వహించాల్సిన ఈ పూజలను వర్షం కారణంగా ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించారు. తొలుత రుత్విక్ వరణం, ఉత్సవాంగీకారం జరిపారు. అనంతరం ఆలయం నుంచి చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి వేదికపై అధిష్ఠింపజేశారు. పుట్టమన్నుని స్వామి వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం మృత్యం గ్రహణం, యాగశాల ప్రవేశం, యాగశాలార్చన చేపట్టారు. తర్వాత మన్నుని పాలికల్లో వేసి పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు, ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు. అర్చకులు, రుత్వికులకు ఈవో దీక్ష వస్త్రాలను అందజేశారు. పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం పవిత్రాధివాసం, చక్రాబ్జమండల రచనం, ఆవాహనం, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి.

నర్సుల భారీ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న కాంట్రాక్టు నర్సులు

మహారాణిపేట: తమను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ నర్సులు నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. కేజీహెచ్ వద్ద మొదలైన ర్యాలీ జగదాంబ వరకు సాగింది. కాగా.. నర్సులు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి.. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన కాంట్రాక్టు నర్సులకు పోస్టింగ్స్‌లో తగిన ప్రాధాన్యమివ్వాలని పోరాట కమిటీ నాయకుడు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ, సంక్షేమ శాఖ ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 115ను తక్షణమే రద్దు చేయాలన్నారు. సంఘ నాయకులు జి.శాంతమ్మ, బి.శాంతికుమారి, కె.సూర్యకళ, ఎస్.వరలక్ష్మి, రత్నప్రభ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం

ఆరిలోవ: సంజయ్ గాంధీకాలనీలో ఆటో డ్రైవర్ సీహెచ్ అప్పారావు ఇంట్లో జరిగిన దొంగతనం కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈనెల 11న అప్పారావు అతని కుటుంబ సభ్యు లు తలుపులకు తాళం వేసి.. తాళం చెవిని కిటికీ వద్ద పెట్టి బయటకు వెళ్లారు. వారు తిరిగి వచ్చేసరికి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి 10 తులాల బంగారం, రూ.10 వేల నగదును పట్టుకుపోయారు. ఈ ఘటనపై బాధితుడు ఆరిలోవ పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం ఏసీపీ వెంకటరావు, సీఐ బంగారుపాప శుక్రవారం అప్పారావు ఇంటి పరిసరాలను పరిశీలించారు. చోరీకి సంబంధించిన ఆధారాలను సేకరించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు.